

# సంసారంలో శారద




యద్దనపూడి సులోచనారాణి

"ప్రత్యేకం స్కూలుకు వెళ్ళి అభ్యసించే విద్య స్త్రీలకు పూర్తిగా అనవసరం. స్త్రీలు నేర్చుకోవాల్సిన కళలు వేరే ప్రత్యేకంగా వున్నాయి. అవి ఒకటీ రెండూ గాదు అనేకం. పురుషుడు తన స్వార్థంతో స్త్రీకి చదువువద్దు అనటం లేదు. ఉదాహరణకి వీణ ముందు పెట్టుకుని హాయిగా కమనీయంగా గానంచేసే స్త్రీకి, బండెడు పుస్తకాలు మోయలేక మోస్తూ మైలుదూరం నడిచివెళ్ళి యేవో రెండు ముక్కలు అసంపూర్తిగా నేర్చుకుని పునూరుమంటూ యింటికి వచ్చే స్త్రీకి చాలా తేడా వుంది. మొదటి స్త్రీ కావాలంటే తను నేర్చిన విద్యలో లోతులు తెలుసుకుని అవి యితరులకు గూడా తెలిపి అందరినీ ఆనందపరచగలదు. రెండో యువతికి ఆ అవకాశం తక్కువ. చదువుకూడా ఒక విధమైన మోటుపనే. జీవితాన్ని గంగిరెద్దు భారం మోసినట్లు మోయటానికి పురుషుడే సరిపోతాడు. ఆ భారాన్ని కొంచం సులభం చేసుకోవటానికిగాను యీ చదువు ఆధారం చేసుకుంటాడు. పైపెచ్చు యేమిటంటే సహజంగా స్త్రీ అసలు శక్తి స్వరూపిణి. పుట్టుకలోనే ఆమెలో కొన్ని శక్తులుద్భవించి వుంటాయి. దానికి తోడు యీ అవకతవక—"

ఆపైన చదవలేక శారద పత్రికను విసిరి పుచ్చుకుని గిరాటుకొట్టింది విసుగుతో. ఒక చెంపను స్త్రీలు సమస్తరంగాల్లో అభివృద్ధిలోకి వస్తున్నా యీపాతపురాణం విన్పిస్తూనే వుంది. అవును మరి. యుగయుగాల నుంచి నరనరాల్లో జీర్ణించుకుపోయిన బూజుపట్టిన భావం ఒక్కసారి పోతుందా? ఇంతకీ వ్యాసం వ్రాసిన రచయిత యువకుడా, వృద్ధుడా అన్న అనుమానంతో శారద వంగి పత్రిక తీసి పేరు చూసింది. రచయిత అసలు పేరు లేదు. యేవో పొడిఅక్షరాలు ఆడపిల్ల పేరును సూచించేటట్లుగా వున్నాయి. ఇప్పటి మగవాళ్ళకి యిదో ఫాషనయిపోయింది. పేరు ఆడపిల్లదయినా వ్యాసం వ్రాసినది మగవాడే నన్న సంగతి స్పష్టంగానే తెలుస్తోంది. శారదదృష్టి ఒక వాక్యం మీద పడింది. పత్రికను మళ్ళా టేబిల్ మీద పడేసింది. వ్యాసరచయితకి యేమీ బొత్తిగా పనీపాటా లేదల్లేవుంది. తీరుబడిగా కూర్చుని పాపం స్త్రీలమీద మొదలు పెట్టాడు. బహుశా అతనికి బయట ప్రపంచంలో యేం జరుగుతుందో తెలియదు గాబోలు. యేదో ఒక మారుమూల ఒక గుహలాంటి చీకటి గదిలో కూర్చుని సిగరెట్ మీద సిగరెట్ కాల్చుకుంటూ యేం తోచక మొదలుపెట్టి వుంటాడు. తన గది తప్ప అతనికి మరో ప్రపంచం తెలియదుగాబోలు. ఒక వేళ తెలిసినా ఊహాలోకాల్లో విహరించే వ్యక్తి సహజంగా యెలా అర్థం చేసుకో గలుగుతాడు? బయట ప్రపంచంలో మామూలుగా తిరుగుతూ నేటి సమాజంలో స్త్రీ స్థానాన్ని గుర్తించ గలిగిన వాడయితే ఈ విధంగా వ్రాయటానికి సాహసించి వుండేవాడు గాదు. యేమీ తోచని శారద వ్యాసం వ్రాసిన రచయితను తన వూహాలో చిత్రించుకుని చూడటం మొదలు పెట్టింది. చదువుకున్న స్త్రీ కంటె వీణ వాయిస్తున్న స్త్రీ అందంగా కన్పించింది గాబోలు మహానుభావుడికి. కవిగా-బాహ్య సౌందర్యం చూడగలిగాడు కాని ఆత్మ సౌందర్యం అక్కర్లేక పోయింది గాబోలు.

బద్ధకంగా ఆవలించి ఒళ్ళు గట్టిగా విరుచుకుని సోఫాలో వెనక్కు జారగిలబడింది శారద. యేమీ తోచటం లేదు. తను బి. ఎ. పాసయింది. ఎమ్. ఎ. చదువుతానంటె అత్తయ్య వద్దంది. అత్తయ్య పిచ్చిగాని తనకు వచ్చినంత కట్నంయిచ్చి వైభవంగా పెళ్లిచేసి వృధాగా ఖర్చుపెట్టేకంటే తనకు చదువు చెప్పిస్తే పోదూ? ఇదే అత్తయ్య దగ్గరంటే "చాల్లె నోర్మూయ్. ఈ ఆస్థంతా తగలేసినువ్వు చదివి వెలగబెట్టేది మటుకు యేమిటి? నెలకు మూడొందలు కాదంటే నాలుగొందలు రూపాయల వుద్యోగమే కదా! అంత ఖర్మ నీకేం పట్టింది. నీ వుద్యోగం తన వుద్యోగం కలిపి తనే చెయ్యగల మొగుడిని తీసుకొస్తా నీకు. యేదో సరదాకి నాలుగేళ్ళు చదివావు బాగుంది. అంతేగాని." అంటుంది అత్తయ్య. అత్తయ్య దృష్టిలో చదువు సరదాపని. ఇది విడమర్చి మరో విధంగా చెప్పినా ఆవిడకర్థం గాదు. అందుకనే తను మెదలకుండా వూరుకుంది. తను ఎమ్. ఎ లో చేరివుంటే యిలా బద్ధకంగా ఆవలిస్తూ గడిపేదా? అప్పుడెంత బిజీగా వుండేది! శారదకు మళ్ళా ఆవులింత వచ్చింది. ఈ సారి ఆవలింతకు కళ్ళల్లో నీళ్ళు కమ్మినాయి. లేచి బద్ధకంగా చీర అంచుతో కళ్లు తుడుచుకుని వచ్చి కిటికీవద్దనిలబడి వీధిలో వచ్చేపోయే జనాన్ని చూడసాగింది. నాలుగు దాటినట్లుంది. సూర్యుడు ఆవలిస్తూ పశ్చిమానికి దిగటం ప్రారంభిస్తున్నాడు. స్కూలునుంచి పిల్లలు నెమ్మదిగా యింటికి వస్తున్నారు. వాళ్ల అలసటంతా వాళ్ల మొహాల్లోనే కనిపిస్తోంది. వాళ్ళకి యీరోజు యే విధంగా గడపాలా అన్న చింతే వుండదు. తనలాగే ప్రకృతి గూడా బద్ధకంగా, యేమీ తోచక విసుక్కుంటున్నట్లుగా కన్పించింది శారదకి. తిరిగొచ్చి సోఫాలో కూలబడింది. ఉన్నపళంగా యీ పట్టున ఈ మేడ కూలిపోతే యేమవుతుంది? తను సోఫాతో సహా,



తిరుచిరాపల్లి కోట

ఫొటో: వి. కేశవశర్మ.

కుర్చీలు బల్లలు, యెదురుగుండా వున్న నిలువుటద్దం, ప్రక్కనున్న పుస్తకాల బీరువా ఒక్కసారి అన్నీ కలిసి అడుక్కుపోతాయి. తనప్పుడు ప్రాణభీతితో కేకలు పెట్టినా యెవరికి విన్పించదు గాబోలు. ఆ దృశ్యం ఊహించుకునే సరికి శారదవళ్ళు ఝల్లుమంది. వరాలు తెలియని బాధతో విలవిలలాడినాయి. కాని మరుక్షణంలో శారద తన పిచ్చితనానికి తనే నవ్వుకుంది. ఇదంతా తనకు తోచకపోవటంవల్ల వచ్చే వికృతాలోచనలు అనుకుంది. ఇంతలో సీత పైకి వచ్చి "అమ్మాయి గారూ! బూబమ్మగా రొచ్చారు." అంది. బూబమ్మగారంటే శారద అత్యంత ప్రియమైన ప్రాణస్నేహితురాలు మొహరున్నీసా. ఆ ముస్లిం పేరు నోరు తిరగక సీత క్లుప్తంగా తన భాషలో బూబమ్మ అంటుంది. శారద బద్ధకమంతా క్షణంలో వదలిపోయింది. లేచి క్రిందికి రాబోతుండగా ఇంతలో మొహరున్నీసాయే పైకి వచ్చింది. యెదురు వచ్చిన శారద స్నేహితురాలి చేతుల్లో తన చేతులు కలిపి తన్మయత్వంగా మొహంలోకి చూస్తూ,

"అబ్బ. ఇవాళెంత బాగున్నావ్. మా హిందూ యువకులెవరయినా చూస్తే నువ్వు గూడా మా వాళ్ళమ్మాయివే ననుకుని అమాంతం ప్రేమిస్తారు గూడాను. నిజంగా మొహర్. ఇవాళ మరీనూ అచ్చు మా హిందువులమ్మాయిలానే వున్నావు అంది. మొహరున్నీసా యెప్పుడు శారదా వాళ్ళ యింటికి వచ్చినా హిందువుల పద్ధతిలోనే డ్రెస్ చేసుకుని వస్తుంది. అందుకే శారదా వాళ్ళ యింట్లో వారికి తెలియకుండానే మొహర్‌కు చనువిచ్చారు. శారద మేనత్త పంకజమ్మ అప్పుడప్పుడూ మొహర్‌ని చూసి యిలా అంటూ వుంటుంది. "చూడు వదినా. మొహర్ అసలు న్యాయంగా మన వాళ్ళలో పుట్టవలసిన పిల్ల సుమా. దేవుడు యేదో పరధ్యాసగా ముస్లిం పిల్లగా పుట్టించాడుగాని" అంటుంది. ఆవిడ దేవుడి పరధ్యాసకు చాలాసార్లు విచారించటం గూడాకద్దు.

"అబ్బ. సాటిలేని యిప్పటి నీ సౌందర్యానికి బొట్టు లేకపోవటం కొంచం కొరతిగా వుంది. బొట్టు పెట్టుకోరాదూ? యేమవుతుంది యింతలో? మీ అల్లా వచ్చి నీ గొంతుపిసుకుతాడని భయమా?" స్నేహితురాలిని సోఫాలో ప్రక్కన కూర్చోపెట్టుకుంటూ అంది శారద.

"అది మా సాంప్రదాయానికి విరుద్ధమని నీకెన్నిసార్లు చెప్పాలి?"

"మరి యీ వేషం?" శారద యెదురు ప్రశ్న వేసింది.

"డ్రెస్ చేసుకోవటమనేది నేను ఒక కళగా భావిస్తాను. బొట్టు పెట్టుకోవటమనేదిగూడ ఒక కళే నన్న అభిప్రాయం నాలో నాటుకున్నప్పుడు తప్పకుండా అలాగే పెట్టుకుంటాను. సరేనా?"

అని జవాబిచ్చింది మొహార్. శారదకు మరో ప్రశ్న వెయ్యటానికి అవకాశం దొరకలేదు. మాట్లాడకుండా చూస్తున్న శారదతో "యేం? అలావున్నావేం? నిద్రపోయి లేచావేమిటి?" అంది ప్రసంగం మారుస్తూ.

"ఊ! అదే. లేచి చాలాసేపయ్యింది. యేం తోచటంలేదు." అంది శారద తనకున్న బద్ధకమంతా కంఠస్వరంలో చూపిస్తూ.

"యెందుకు వుదయం మాయింటికి ఖబురు పంపావు?"

"ఊరికే నే. నువ్వు మా యింటికివచ్చి 15 రోజులయింది."

"నువ్వు మా యింటికివచ్చి?" యెదురు ప్రశ్న వేసింది మొహార్.

"నన్ను చూడకపోతే నువ్వు వుండగలవు. నిన్ను చూడకపోతే నేనుండలేను." అంది నవ్వుతూ శారద.

"సర్లె. నేర్చావు బాగా మాటలు. ఇంతకీ యెందుకు ఖబురుపంపావో చెప్పనే లేదు." మొహార్ సూటిగా శారద కళ్ళలోకి చూసింది. ప్రశ్న తాలూకు ఛాయలు యెక్కడయినా లీలగానన్నా కన్పిస్తాయేమోనని. శారదగూడా మొహార్ కళ్ళలోకి చూచింది. ఇద్దరూ ఒకళ్ళ కళ్లలోకి ఒకరు సూటిగా చూసుకుని ఇద్దరూ ఒక్కసారి ఫక్కుమని నవ్వుకున్నారు. యేదో హుషారయిన విషయమే అనుకుంది మొహార్.

"నీతో కొంచం పనుంది. అందుకని అది చెబ్దామని పిలిచాను."

"యేమిటా పని?" నవ్వుతున్న శారద కళ్ళల్లోకి సందేహంగా చూస్తూ అంది మొహార్.

"వూహించు మరి" శారద కళ్ళు చిలిపిగా నవ్వాయి.

"బేగంగారికి రాజాసాబ్ గాదుకదా!" మొహార్ అప్రయత్నంగా అంది.

శారద నవ్వి మొహార్ బుగ్గమీద చిన్న దెబ్బకొట్టి లేచివెళ్లి అద్దంలో తన ప్రతిబింబాన్ని చూచుకుంటూ "అవును మొహార్. అందులో నీ పరీక్షకు నిలవగలిగి అందులో మంచిమార్కులు తెచ్చుకుంటేనే—" ఆ తర్వాత మాటలు అనకుండా శారద చక్రాల్లాంటి తన కళ్ళని వయ్యారంగా త్రిప్పింది.

"వివరాలు?" మొహార్ ప్రశ్న వేసింది.

"వివరములకు శేరాఫ్ పంకజమ్మగారు."

"సర్లెగాని. పరీక్ష అంటున్నావు. నాకు పరీక్షా గిరీక్షా యేమీ తెలియదు బాబూ, తర్వాత యేదయినా అయితే నన్ను వేపుకు తింటావు" అంది మొహార్ బుదిమంతురాల్లాగా వచ్చేనవ్వును పెదవులు బిగించి ఆపుకుంటూ "శారదా! మీ నాన్నగారు పిలుస్తున్నారే." క్రిందనుంచి తల్లి కేక విన్పించింది.

ఇద్దరూ కలిసి క్రిందకు దిగివచ్చారు. పడక్కుర్చీలో శారద తండ్రి పడుకుని చుట్టకాల్చుకుంటున్నారు. ఆయనకు కుడిచేతిప్రక్కనున్న సోఫాలో శారదా, మొహార్ కూర్చున్నారు.

"యేమ్మా! మొహార్ నీకింకా కబురు పంపిద్దామనుకుంటున్నాను" గురువారంనాడు శారదని చూడటానికి వస్తారు. ఆరోజు నువ్విక్కడే వుండాలి. కావాలంటే మీ పెద్దనాన్నకు కబురు పంపుతాను." అన్నారు. మొహార్ తండ్రి చిన్నప్పుడే చనిపోవటం మూలాన పెత్తండ్రిదగ్గర పెరుగుతోంది. మొహారున్నసాకు శారద తండ్రిదగ్గర బాగా చనువుంది. వినయభూషణ అయిన మొహారీని చూస్తే ఆయనకు వల్లమాలిన ఆపేక్ష. "యే వూరునుంచండి; యేం చదివాడు." వివరాలు తెలుసుకోవాలనే ఆసక్తితో అడిగింది మొహార్. ఇంతలో పంకజమ్మగారు యెందుకో ఆహాలులోకివచ్చింది. ఆవిడలేనిదే ఆ యింట్లో యే సంభాషణ, యేపనీ జరగదు. ఇది మొహార్‌కి గూడా తెలుసు.

"రండత్తయ్యా" అని పిల్చింది. పంకజమ్మగారు లోపలవేపుచూసి "ఇదుగో వదినా మన మొహార్ గూడా వచ్చింది కాఫీ పంపవమ్మా" అని తనువచ్చి శారద ప్రక్కన కూర్చుంది.

"అమ్మాయి పిల్లవాడినిగురించి అడుగుతోంది." అన్నారు శారద తండ్రి. అంతా చెల్లెలికి తప్ప తనకు యేమీ తెలియనట్లు. కారణం పెళ్ళికొడుకు పంకజమ్మగారికి అత్తవారివేపు దూరపు బంధువు.

"కుర్రాడినిగురించి యేముంది. ఎమ్. ఏ. గాబోలు పాసయాడు. తల్లితండ్రీ యెవరూ లేరు. చిన్నప్పటినుంచీ మేనత్తే పెంచుతోంది. ఆ మేనత్తకీ యెవరూ లేరుగాబట్టి ఆవిడ తదనంతరం ఆస్తంతా యీ కుర్రాడికే వస్తుంది. తెలివితేటమాట లెలావున్నా కుర్రాడు మంచిరూపసి. వాళ్ళు మా మామగారికి దగ్గరచుట్టాలు. ఈ పెళ్ళితో మళ్ళా యెదో కొత్త సంబంధమన్నా కలుస్తుందేమోనని ఆశిస్తున్నాను. అదీగాకుండా పిల్లవాడు యేమో కథలూ అవీ గూడా వ్రాస్తాడని విన్నాను." అంది పంకజమ్మ వంచుకు వున్న మేనగోడలి మొహం చూస్తూ.

"అయితే జోడా సమానంగా వుంటుందిలెండి" అంది మొహార్.

"నవ్వుతూ. శారదగూడా అప్పుడప్పుడూ యేవో వ్రాస్తూనే వుంటుంది."

"ఇంతకీ పిల్లవాడు ఎక్లాస్ అంటారు. అంతేనా?" అంది మొహార్. "కాకపోతే అసలు నేను కన్నెత్తి అటు చూస్తానా?" పంకజమ్మ ఠీవిగాఅంది. ఇంతలో శారదతల్లి కాఫీలు పంపించింది.

ఆ రాత్రి చాలా ప్రొద్దుపోయేవరకూ మొహారున్నీసా ఇక్కడే వుండిపోయింది. స్నేహితురాండ్రిద్దరూ పెళ్లికొడుకుని యేవిధంగా పరీక్ష చెయ్యాల్సింది నిర్ణయించుకుని రిహార్సల్స్ చేసుకున్నారు.

అనుకున్నరోజుకు పెళ్ళివారు రానే వచ్చారు. పెళ్ళివారంటే యెవరోగాదు స్వయంగా పెళ్ళికుమారుడు, సాక్షాత్తూ అతని మేనత్త. యెరిగివున్న సంబంధమే కావటంవల్ల మధ్యవర్తుల ప్రసంగమే లేదు. ముందు వధూవరులమాట యేవిధంగావున్నా పిల్లాడి మేనత్తా, పిల్ల మేనత్త యెందులోనూ తీసిపోనట్లు సమవుజ్జీలుగా వున్నారు. శారద తల్లి యెందులోనూ యేమీ కల్పించుకోవటం ఆవిడకు అలవాటులేదు. ఆడబడుచు చెప్పిన పనిని మౌనంగా నిర్వర్తించటం ఆవిడ క్రొత్తగా కాపురానికి వచ్చినప్పుడే అభ్యాసం చేసుకుంది. ఆవిడ ప్రస్తుత వుద్దేశం యేవోవిధంగా శారదను సలక్షణంగా అత్తవారింటికి పంపటమే. "మావాడికి ఎమ్. ఎ. లో క్లాసువచ్చింది. అదేదో ఫస్ గూడ వచ్చాడుట. మెడల్ గూడా యిచ్చారు." అంది పిల్లాడి మేనత్త.

"మా అమ్మాయి బి. ఎ. లో క్లాస్ తెచ్చుకుంది. ఎమ్. ఎ. చదవాలని ఉబలాటపడింది గాని మేమేవద్దని మాన్పించివేసాం. అదిగాకుండా మా శారద కథలు, వ్యాసాలు గూడా వ్రాస్తుంది." అంది పంకజమ్మగారు పెళ్ళికుమారునికంటె తన కోడలు మరో ఆకు ఎక్కువ చదివేవుందని నిరూపిస్తూ. పెళ్ళికూతురు కథలు వ్రాస్తుందనేసరికి పెళ్లికొడుకు తలెత్తిచూడబోయాడు కాని ప్రక్కనున్న మొహార్ తన్ని తీవ్రంగా పరీక్షచేస్తుండటం మూలాన యెత్తిన కళ్ళు సగంలోనే దించేసుకున్నాడు.

ఇదంతా ఆడవాళ్ల వ్యవహారంగావటం వల్ల శారద తండ్రి పెళ్ళికొడుకుతోనే యేవో రెండు మూడు మాట్లాడి వూరుకున్నాడు.

"మాకు పిల్లనచ్చిందండి. ఇంక పై వ్యవహారాలు మాట్లాడుకుంటే నయం. పొద్దుపోతోంది. మళ్లా మేము ట్రెయిన్‌కు అందుకోవాలి." అంది పిల్లాడి మేనత్త

"అలాగే. పిల్లవాడి విషయంలో మాకూ యే అభ్యంతరం లేదు." అంటూ ఆవిడ అన్నగారివంక చూచింది. ఆ మానవమూర్తి గంగి

గోవులాగ అంగీకారంగా తలాడించి తన అభిప్రాయం తెలిపాడు. శారదకు తల పిడుగు పడ్డట్లయింది. మొహార్ గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్లయింది. ఇద్దరూ వేసుకున్న ప్లానంతా పంకజమ్మ సర్వనాశనం చేసింది. శారద, మొహార్ ఒకళ్ల కళ్లలోకి ఒకళ్లు నిస్సహాయంగా చూసుకోవటం పెళ్లికొడుకు దృష్టిని దాటిపోలేదు.

మొహార్ తన మేనల్లుడిని పరీక్షగా చూడడం గమనించి అతని మేనత్త పంకజమ్మతో "ఈ పిల్ల యెవరూ? మొహాన బొట్టు లేదే?" అంది. ఇవాళ మొహార్ అలంకరణ మరీ యిదిగావుంది. శారదది మైసూర్ క్రేప్ సిల్కు చీర లేతనీలం నల్లని బార్డరుకలది కట్టుకుని తెలుపుసిల్కు జాకెట్ వేసుకుంది. శారద బలవంతంమీద మొహార్ అవిధంగా తయారు కావల్సి వచ్చింది మొహార్ నలా అడగటంతోనే పంకజమ్మగారికేం చెప్పాలో తెలియలేదు. ఈ పిల్ల ముస్లింపిల్లని చెప్పటానికి సంకోచించింది. నిజంగా అవాళ మొహార్ ప్రవర్తన వాళింట్లో పిలకు మల్లేనేవుంది.

"మా మేనత్త కూతురండి." శారద తను కలుగచేసుకుని చెప్పింది.

"మీ అమ్మాయా?" సర్దుకుని మొహార్ ని చూస్తూ అంది ఆవిడ. పంకజమ్మగారు ఉరిమినట్లుగా ఒక్కసారి శారద కళ్లలోకి చూసి మళ్లా వెంటనే సర్దుకుని "అవ్వే మా చెల్లెలి కూతురండీ. తల్లిపోతే నాలుగు రోజులుంచుకుని పంపిద్దామనుకుని తీసుకొచ్చాం."

"మరి బొట్టు లేకే మొహానా?"

అత్తయ్య యింకా యే అవకతవక జవాబు చెప్తుందోనన్న భయంతో శారద తనే ముందుగా "ఇష్టంలేదు. చిన్నప్పటి నుంచీ తలితండ్రులు అలా అలవాటు చేశారండి."

మొహారున్నీసామనస్సు చివుక్కుమంది. తన తల్లి సలక్షణంగా యింటివద్దవుంటే తనకిదేం ఖర్మ! అందుకనే యెవరిహద్దులు వాళ్ళు దాటకూడదంటారు. పోనీ తన చెల్లెలి కూతురని చెప్పి వూరుకోగూడదు. ఇంకెప్పుడు యిలా చెయ్యను బుద్ధివచ్చింది అనుకుని మనసులో గట్టిగా లెంపలు వేసుకుంది.

పావుగంటలో యిచ్చి పుచ్చుకోవటాలు కుదిరిపోయినాయి. ఎమ్. ఎ. పాసయినా, నేటిసమాజంలో తిరుగుతున్నా మేనత్త పది వేలు కట్నం అడుగుతుంటే కనీసం మాటకూడా మాట్లాడలేదు మహానుభావుడు అనుకుంది శారద. మూగవాడేమో అన్న అనుమానంగూడా వేసింది. మొహార్ కివేమీ పట్టలేదు.

యెప్పుడు యీ తతంగమంతా అవుతుందా పీడ వదిలించుకుని బయటకుపోదామా అని బిగపట్టుకుని కూర్చుంది. పెళ్లికొడుకు మేనత్త వూరుకోకుండా మొహార్ మొహాన బొట్టు గూడా పెట్టించింది. అత్యంతప్రియమైన ప్రాణస్నేహితురాలు శారదకళ్లలో దీనత్వం చూసి మొహార్ బలవంతాన కోపం ఆపుకుంది. అద్దంలో చూచుకున్నప్పుడు కోపంతోనూ. అసహ్యంతోనూ యెంత జేవురించిందో చూసుకున్న మొహార్, బొట్టు పెట్టటంమూలానా మొహం ఎంత అందంగా తయారయిందో చూసుకోలేకపోయింది అనుకుంది శారద.

పంకజమ్మ పది వేలు తనకు పదికాసులన్నట్లుగా మాట్లాడింది. అత్తయ్యలో వచ్చిన ఈ ఆవేశం శారదకేగాదు ఆమె తండ్రికికూడా అర్థంగాలేదు. ఇద్దరూ మేనత్తలూ వచ్చిన పని మర్చి యిద్దరి గొప్పలూ చెప్పుకో నారంభించారు. శారదకు విసుగెత్తింది. "మొహార్ పైకిపోదాంరా" అంది లేచి నిలబడి, మొహార్ అనగానే పెళ్లికొడుకు వులిక్కిపడి తలెత్తి శారదవైపు చూచాడు. అతను చూడటంతోనే శారద నాలిక కరచుకుని తన మేనత్తవైపు చూచింది. తమ ఆస్థిపాసులను గురించి చెప్పుకుంటున్న వారిద్దరూ యీలోకంలో లేరు. శారదభారం తీసినట్లు వూపిరివిడుస్తూమళ్ళా 'పైకిపోదాంరా' అంది.

"యేంశారదా పైకి వెళ్తున్నారా? వెళ్లండి" అంది పంకజమ్మ శారదమీద తనకెంత అధికారంవుందో చూపిస్తూ. అర్థంలేని హుందాతనం అత్తయ్య అనవసరంగా చూపించడం శారదకు మరింత మంటెత్తించింది. మెదలకుండా సహించి మొహార్ తో పైకి వెళ్ళిపోయింది.

ఆరాత్రి యింటికి వెళ్లిపోతున్న మొహార్ ని మేనత్తతరపున, తన తరపున శారద తనే క్షమాపణ వేడింది. మొహార్ జవాబేమీ ఇవ్వకుండానే వెళ్ళిపోయింది. ఆరోజు తన అత్తయ్యమీద శారదకు అంతులేని ఆగ్రహం వచ్చింది. అయితే మటుకు యేంలాభం? పేదవానికోపం పెదవికి చేటు. యేనాడో అత్తయ్య ఆస్థి ఆవిడ తదనంతరం తనకు వస్తుందని ఈనాడు తనకీబంధన. శారదకు అప్రయత్నంగా దినికంతకూ కారణమైన తన తలిదండ్రులమీద ఆగ్రహం వచ్చింది. అయినా చేసేదేమీ లేక వుస్సురంటూ కుర్చీలో కూలబడింది.

అనుకున్న లగ్నానికి శారదకు చంద్రశేఖరానికి పెళ్ళయిపోయింది. చిన్న చిన్న కలతలు వచ్చినా అవేమీ లెక్కలేనట్లు సలక్షణంగానే అయిందీ అనిపించారు. పెళ్ళిలో పెళ్ళికొడుకు, పెళ్ళికూతురు కంటె, వారిద్దరి మేనత్తల్ని గురించి, వారి ప్రతిభలనుగురించి అందరూ కథలూ గాథలుగా చెప్పుకోవటం ప్రారంభించారు. ఇద్దరి గొప్పల ఫలితంగా ముఖ్యంగా శారదకూ, చంద్రశేఖరానికి తమ మేనత్తల తదనంతరం యేనాడో రావలసిన ఆస్తులు పెళ్ళిపీటల మీదనే వచ్చాయి. వీళ్ళిద్దరి తంతు చూస్తుంటే శారదకు శివమెత్తుతోంది. కాని చంద్రశేఖరంలో మటుకు ఏచలనమూ లేదు. అందరితోపాటు అతనూ తమాషా చూస్తున్నట్లుగా వూరుకున్నాడు.

విడిదిలో బంతులాట అంది శేఖరం మేనత్త. ఇదేం ఖర్మంరాబాబూ. తనెంత ఆదర్శప్రాయంగా నాగరికతగా చేసుకోవాలని వుబలాటపడిందో అంత పురాతన పద్ధతుల్లోకి దింపుతున్నారు అనుకుంది శారద.

"విడిదిలోవల్లగాదు. ఇక్కడే." పంకజమ్మ పట్టుబట్టింది.

"కాదు. అలా జరగటానికి వీలులేదు." శేఖరం మేనత్త మొండికెత్తింది. చిన్న చిన్న మాటలతో ప్రారంభమై చివరకు తీర్పులేని పెద్ద కలహంలోకి దిగింది. ఇదరూ చెరో వైపూ నుంచుని గర్జిస్తున్నారు. వారి దగ్గరకు వెళ్ళి నచ్చచెప్పేదమ్మలు వచ్చిన చుట్టాల్లో యెవరికీ లేవు.

"నా యిష్టం వచ్చినట్లుగా చెయ్యకపోతే పిల్లను వదిలేసిపోతాం. అంతటితో రోగం వదులుతుంది." శేఖరం మేనత్త ఆఖరి అస్త్రం తీసి ప్రయోగించింది. ఈ అస్త్రంతో పంకజమ్మ కాళ్ళబేరానికి వస్తుందని ఆవిడ అభిప్రాయపడింది. కాని త్వరలోనే ఆ అభిప్రాయం వదిలేసుకోవాల్సి వచ్చింది. శేఖరం మేనత్త మాట్లాడినమాటలు వింటూనే పంకజమ్మ ఖంగుమంది.

(మిగతా కథ పైవారం)


నంజనగూడు పండితపాదివారి
జ్వరేగ్
సకల జ్వరములను అద్భుతముగా నివారించును.
క్యాటలాగ్ ఉచితము
సోలేఏజంట్లు. యునైటెడ్ కన్‌సర్న్, మదరాసు-1.
బ్రాంచీలు: హైదరాబాదు & విజయవాడ.

మా వద్ద
కిర్లాస్కర్ ఇండియా మాన్
ఇంజన్లు, మోటారు పంపు
సెట్లు, చెఱకు గానుగలు
దొరుకును.
రేడియో అండ్ ఎలక్ట్రికల్సు.
విజయనగరం.
ఫోను :111 గ్రాం : RADELECT



# సంసారంలో శారద

యద్దనపూడి సులోచనారాణి



(గతవారం తరువాయి)

"పోనీ పోండి. యెవరిదగ్గరా మీ బెదిరింపు. ఓహో! తాటాకుల చప్పుళ్ళకి కుందేళ్లు బెదరటమూ యిది. ఈ అయిన ఖర్చంతా పాటికి గతిలేక అలా లక్ష్మణా అని యేడ్చేవాళ్ళకి దానం చేశా ననుకుంటాము; వదిలేసిపోతుంది. మాట అయితే అంది గాని. దమ్ములుంటే చెయ్యమను చూదాం. హు! ఈ పంకజమ్మ తడాఖా తెలియదు గాబోలు."

పెళ్లి పందిట్లో నిలబడి పంకజమ్మ ఆడుపులిలా గర్జించింది. యెవరూ యేమీ చెప్పలేక పోయారు. యెక్కడివాళ్ళక్కడ నిలబడి గుంపులు గుంపులుగా చేరి గుసగుస లాడుకొంటున్నారు. కొంతమంది ఇరుపక్కలా బలం సమానంగా వుందిగాపట్టి ఫలితం యేమవుతుందా అని జోస్యం చూస్తున్నారు. చివరకు శారద తల్లి ఆడబడుచు దగ్గరకువెళ్ళి "ఇంత చిన్న విషయంకోసం తగాదా వద్దు వదినా. పోనీ. మనం ఆడపిల్లవాళ్ళం, కొంచం అణిగివుంటేమటుకు యేం? నువ్వు రవంత పట్టు సడలించుకోకపోతే యెలా?" అంది కళ్లనీళ్లు పెట్టుకుంటూ.

"చిన్న విషయం! ఇది నీకు చిన్న విషయంగా కన్పిస్తోందా? ఆడపిల్లవాళ్ళ మయినంతమాత్రాన యెందుకు లొంగాలి, యేం తీసరమా? అడిగినంత కట్నం మాయమాట్లాడకుండా యిచ్చామే. లాంఛనాలన్నీ ముచ్చటలా తీర్చాము, ఆ వరసనచూస్తే వాళ్ళే మనకు లొంగాలి. ఈనాడు మనం లొంగితే లొంగినట్టేనా? రేపు దాన్ని వేపుకుతినరూ? యేం ఆ మాత్రం బుద్ధుండక్కర్లా. చూస్తాను యేంచేస్తారో. నువ్వు మాట్లాడకు." అంటున్న యెగిరిపడిన పంకజమ్మను చూసి శారద తల్లి వాడిపోయింది. ఇహ లాభంలేదని భర్త దగరకువెళ్ళి "పిల్లను పంపేమార్గం చూడండి." అని మొర పెట్టుకుంది. "ఆ మార్గం నాకంటె చెల్లాయికే బాగా తెలుసు" అన్నాడాయన కాలిపచుటను క్రింద దులుపుతూ. తన ఆస్తంతా వ్రాసి యిచ్చి పెద్ద పెట్టున ఖర్చు చేసి ఘనంగా పెళ్ళి చేసిన పంకజమ్మకు శారదమీద ఆమాత్రపు హక్కుందని ఆయన అభిప్రాయం.

పరిస్థితి విషమిస్తోంది. శారద కసలే మంటగా వుంది. యెంతో మధురంగా వడవడలసిన ఘడియలు యిలా అయినాయి. ఒంటరితనంకోసం పైకివెళ్లింది. అక్కడ తనగదిలో దృశ్యాన్ని చూసేసరికి శారదలో అంతవరకూ బలవంతాన బిగబట్టుకున్న, కోపం, రోషం ఒక్కసారి యివతలికి దూకాయి. తను నూతనవధువు నన్న సంగతికూడా మర్చిపోయి అక్కడగదిలో తాపీగా పడక్కుర్చీలో పడుకుని చదువుకుంటున్న చంద్రాన్ని చూసి మండిపడుతూ "క్రింద జరుగుతున్న బొమ్మలాట యెవరినిగురించి అనుకుంటున్నారు? మనిద్దర్ని బొమ్మలుగా చేసి వాళ్లిలా కొట్లాడుకుంటుంటే ఇక్కడ మీరు హాయిగా పుస్తకం చదువుకుంటున్నారా? మీరు మగవారు కారూ? మీలో పౌరుషం లేదూ?"

శారద కోపంలో ఉచితానుచితాలు మర్చిపోయి మాట్లాడేసింది. ఈ ఊహించని హఠాత్తుదుడుకుల్ని చూసి మొదట చంద్రం తెల్లబోయాడు. క్షణంసేపు మూర్తీభవించిన ఆగ్రహమూర్తిలా తన యెదుట నిలబడిన శారద కళ్ళల్లోకిచూసి లేచి క్రిందకు దిగి వచ్చేసాడు. ఫలితంగా అసలు బంతులాట అనే కార్యక్రమం రద్దుచేయబడింది. ఈ విధంగా చిన్న చిన్న కలతలతో శారద పెళ్ళి అయిందనిపించారు.

సలక్షణంగానే శారద కాపురానికి వచ్చింది. వంటరి కాపురం పెట్టటానికి వెళ్తున్న చంద్రానితో.

"మనం ఒక్కళ్ళమూ వుండగలమా? నేను సంసారం సరిగ్గా నిర్వహించుకోగలనో లేదో. మా అత్తయ్యన్నా, మీ అత్తయ్యన్నా కొన్నాళ్ళపాటు మన దగ్గర వుంటే బాగుండదూ?" భయపడుతున్నట్లుగా ప్రశ్నించింది శారద.

"జీవితాంతం అత్తయ్యలు మనని కనిపెట్టుకుని వుండరుగా." అన్నాడు చంద్రం నవ్వుతూ.

"యేమోబాబూ! నాకు మటుకు చాలా భయంగా వుంది."

"యేం కాలేజిల్లో స్టేజియెక్కి పోజు పెట్టి వుపన్యాసాలు యిచ్చినట్లు లేదా?" చంద్రం సగం హేళనగా, సగం వెక్కిరింతగా అన్నాడు. శారద కోపంగా భర్త ముఖంలోకి చూచింది.

చంద్రం మాటే చెల్లింది. ఇద్దరూ ఒంటరి కాపురం ప్రారంభించారు. సంసార విషయాల్లో బాధ్యతంతా శారదదే. చంద్రాన్నేది అడిగినా చెప్పడు సరిగదా కనీసం సలహాకూడా యివ్వకపోగా వెక్కిరింతగా మాట్లాడుతాడు. ఆడవాళ్లంటే అతనికో విధమైన చులకనభావముందని శారద త్వరలోనే ఆకళింపుచేసుకోగలిగింది. శారద నెంతగా ప్రేమించినా, లాలించినా హద్దులు దాటి యే మాత్రమూ రానివ్వడంలేదు. శారదతో ఒక్కనాడయినా నువ్వు హృదయదేవతవనిగాని. నా జీవితం నీకు నివేదనగా సమర్పించుకుంటానని గాని అసలా విధమైన మాటలే మాట్లాడడు. ఒక్క శారదా అన్న పిలుపులోనే తనకున్న ఆత్మీయతనంతా, గుమ్మరించి మిగతా మాటల్లో అయిపోయి



శ్రమ జీవులు

చిత్రకారుడు : యం. డి. నెల్‌సన్ -వీరవల్లి.

# ★ సంసారంలో శారద ★

వటుగా మాట్లాడేవాడు. పోనీ ఆ పిలుపులో సగం తగ్గించి, ఇతర వాటిల్లో ఆ మిగిలిన భాగం చూపిస్తే బాగుండు అనుకునేది శారద.

చదువు, సంస్కారం పుష్కలంగావున్న ఈ యువకమూర్తిలో ఈ బలహీనత ఎక్కడి దనిపించేది శారదకి. తనపట్ల భర్త ప్రవర్తనకి కోపపడలేదు. తన్ని అధికంగా చూడలేదని అభిమానపడలేదు. ఏ కారణాలవల్లో కలిగిన దురభిప్రాయాన్ని చంద్రంనుంచి తొలగించు కోవాలని నిశ్చయించుకుంది. సహజంగా చంద్రం ఏదన్నా హేళనగా, వెక్కిరింతగా స్త్రీజాతిపట్ల మాట్లాడినప్పుడు ఎదురు జవాబు చెప్పి అతన్ని తిరస్కరించాలని శారద మనసు ఆవేశపడేది. కాని దానివల్ల లాభంలేదు. సరిగదా అతనిలో అంతకు ముందున్న భావాలు మరింత బలపడతాయి అన్న భావంలో చిరునవ్వుతో చంద్రం విసరే బాణాల్ని మౌనంగా తీసుకునేది. వాటివల్ల తగిలిన గాయాలని కూడా ఏనాడూ శారద చంద్రానికి చూపలేదు.

ఒక రోజున శారద భర్తనిలా అడిగింది "యేమండి! ఆ రోజు నేనలా మాట్లాడితే మీరేమనుకున్నారు?"

"యే రోజు?" ప్రశ్నార్థకంగా మొహం పెట్టి అన్నాడు చంద్రం.

"మీరు మరీను. ప్రతిదీ ఏమీ తెలియనట్లుగానే మాట్లాడుతారు. అది ఆరోజు. మన పెళ్ళిరోజునండి. మీరు పడుకుంటే నేను పైకి రాలా—" తర్వాత శారద చెప్ప లేకపోయింది.

"ఓ! అదా. నేనావేళే మర్చిపోయా ఆ సంగతి" తేలికగా అనేశాడు చంద్రం. శారద అతని నిర్లక్ష్యానికి చిన్నబుచ్చుకుని

"యేమయినా ఆ రోజున మొహార్ చాల బాధపడిందండి పాపం."

"అదేమిటి? అది మరో ప్రకరణంలోని సమాచారమా?"

"మీరు బలేగా మాటాడుతారండి."

"అయితే త్వరగా యేదనా ప్రైజ్ ఇవ్వు మరి."

"మీ కిచ్చేందుకు నాదగ్గరేముందండి—" శారద ఏదో అనబోయింది వెంటనే చంద్రం చేయెత్తి "దయయుంచి తర్వాత మాట్లాడ వద్దు" అన్నాడు. శారద నవ్వింది.

"అవును కానిశారదా ఆరోజున మొహారున్నిసా మీ మేనత్త కూతురని చెప్పావేం?"

"మిమ్మల్ని ఏడిపించాలని." కసిగా అంది శారద.

"అవును మరి ఎవరు యేడ్చారో చివరికి?" చంద్రం నవ్వుతూ అన్నాడు.

"పోనీగాని అది వదిలేసి యిది చెప్పండి మరీ..."

"అయ్యయ్యొ, వదిలి వేయట మేం ఖర్మ. ప్రియ సఖి సంభాషణ."

"అదే చెప్తుంటే ముందు ఇది చెప్పండి."

"మరో ప్రకరణంగాబోలు. ఊ కాని."

"మీ అత్తయ్యనుగురించి మా అత్తయ్య నుగురించి మీ అభిప్రాయమేమిటి చెబుదూ?" శారద చంద్రం కళ్ళలోకి సూటిగా చూస్తూ అడిగింది.

"అభిప్రాయమా? యేముంది? ఇద్దరూ మనిద్దర్నీ కలపటానికి స్వర్గంనుంచి దిగిన దేవతలు" చంద్రం నవ్వాడు.

"మీకు ప్రతిదీ హేళనా వెక్కిరింతాను పోనీ లెండి." శారద కోపం తెచ్చుకుంది.

"అది గాదు శారదా. నేను నిజమే చెప్తున్నాను. ఆనాడు నిజంగా మన అత్తయ్య లిద్దరూ పోటీలు పడకపోతే మనిద్దరికి పెళ్లి యేదిగాదు తెలుసా? అందుకని అంటు

న్నాను. నిజంగా వాళ్ళిద్దరిలో ఆ డంబాలు అపటాటోపం గనక భగవంతుడు ఆసమయంలో పెట్టకపోయినట్లయితే నీ యీ సుందర ముఖారవిందం ఈ పాటికి యెవరి దగ్గర వుండేదో. సరే కాని సాయంత్రం పెందరాళే వస్తాను. నేనొచ్చే సరికి రెడీగావుండు సినిమాకు పోదాం." మరో మాటకు అవకాశం ఇవ్వకుండా చంద్రం వెళ్ళిపోయాడు. శారదకు హృదయకుహరం నుంచి పెద్ద నిట్టూర్పు గుండెల్ని చీల్చుకుంటూ బయటకు వచ్చింది. ప్రస్తుతం యింట్లో చేసే పనేమీ లేదు. మళ్ళా ఒంటరి జీవితపు బాధ బయలు దేరింది, యేమీ తోచటం లేదు. యేమీ తోచకపోవటమనేది కూడా ఒక జబ్బే అనిపించింది. ప్రక్కనున్న కుర్చీలో నిలబడింది తనకూ చంద్రానికి జరిగిన సంభాషణ ఒకసారి తిరిగి నెమరు వేసుకుంది. ఇది వరకుకంటె యిప్పుడు చంద్రంలో కొంచెం మార్పు కనిపిస్తోంది. సంసార విషయాల్లో తన కేదయినా తెలియక బాధ పడ్తుంటే ఇది వరకులాగా నవ్వి వెళ్లిపోవటం లేదు. నిలబడి తనకు సలహా యిచ్చి ధైర్యాన్ని యిస్తున్నాడు. ఈవిషయం శారదకు మనోబలాన్ని కలిగింప చేసింది. కాస్త కదలిక అనేది కలిగితే యెంత మార్పయినా తీసుకురావచ్చు.

శారద మనసు కాసేపు అకెగిరి యికెగిరి మళ్లొచ్చి ఒంటరితనంమీద వాలింది. మనసులో యీబాధ పడ్తుంటే పదిమందిలో వున్నా యొక్కర్తో నిర్జనారణ్యంలో వున్నట్టే అనిపిస్తుంది. శారద లేచి యిల్లంతా సర్దటం మొదలుపెట్టింది. సర్దటం పూర్తయిన తర్వాత రేడియో పెట్టి చూచింది యేదయినా సరే విందామనేసంకల్పంతో. అందులోనూ శారదకు నిరాశే యెదురయింది. అన్ని స్టేషన్లూ మూసి వున్నాయి. విసుగ్గా రేడియో మూసేసి డ్రాయరు తెరిచింది. అందులో యేవో పత్రికలు కన్పించాయి. ఒక పత్రికను తీసుకునివచ్చి కుర్చీలో కూలబడింది. తీరా చూస్తే ముఖచిత్రం కొత్తదిగా వున్నట్టు కన్పించిందిగాని అది శారద చదివిన పత్రికే. శారద దృష్టి హఠాత్తుగా ఒక వ్యాసంమీద పడింది స్మృతిపథంలో ఒకసారి వెనక్కు తిరిగి చూచుకుంది. సరీగా ఆరోజు యిలాగే తనేమీ తోచక బాధపడింది ఆరోజే యీవ్యాసం చదివింది. అప్పుడే మొహార్ కూడా వచ్చింది. ఆలోచనలు గొలుసులు గొలుసులుగా ఒకదానివెంట ఒకటి జారాయి. పత్రిక ఒడిలో అలాగే వదిలేసి చెంపన చేయిపెట్టుకుని శారద శూన్యంలోకి చూడసాగింది. ఇప్పుడు మొహార్ కలకత్తాలో వుంది. దాని మొగుడు చాలా అందగాడే గాని వుత్త కోపిష్టిమనిషి. ఆరోజుల్లో తనూ మొహార్ ఒక్కరోజు చూచుకోకుండా వుండలేకపోయారు. మరి యిప్పుడు కి యెవరి జీవితాలని వాళ్ళు వెతుక్కునేపనిలోబడి ఒక్కొక్కప్పుడు ఆప్తబంధువులని గూడా మర్చిపోతారుగాబోలు. ఆనాడు చంద్రం మేనత్త మొహార్ కిచేసిన అవమానం జ్ఞాపకం వచ్చింది. తన మేనత్తగూడా చాలానీచంగా ప్రవర్తించింది. తనకోసం, తనమీద గల ఆత్మీయతచే మొహార్ అంత అవమానాన్ని సహించింది. కృతజ్ఞతాభావంతో శారద కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

ఆలోచనలోపడ్డ శారద చంద్రం రాకను గమనించలేదు. యేదో పెద ఆలోచనలో నే వుందీ అనుకుని చేతిగడియారంతీసి డ్రాయరు మీదపెట్టి స్టాండ్‌మీద తువాలు తీసుకుని దొడ్లోకి వెళ్లబోతుండగా శారద యీలోకంలోకివచ్చి ఆశ్చర్యంగా "మీ రప్పుడే వచ్చారే" అంది. వెళ్తున్నవాడల్లా ఆగి వెనక్కు తిరిగి "భలే, గుడ్లు పెట్టుకుని చూస్తూ గూడా వచ్చారే అని అడుగుతున్నావా?"

(48-వ పేజీ చూడండి)



# ★ సంసారంలో శారద ★

(23-వ పేజీ తరువాయి)

అని వెనక్కి తిరిగి వెళ్ళిపోయాడు.

ఆవాళ సినిమాకు వెళ్దామని చంద్రం చెప్పివెళ్ళిన సంగతి అప్పుడు గాని శారదకు గుర్తురాలేదు.

చంద్రం కాళ్ళు చేతులు కడుక్కుని వచ్చి కుర్చీలో శారద వదిలేసిన పత్రికను చూస్తూ కూర్చున్నాడు శారద లోపలకు వెళ్ళి కాఫీతో తిరిగి వస్తూ "అందులో నేటి సమాజంలో స్త్రీ" అనే వ్యాసం చదివారా? అంది.

"యేం?" చంద్రం కాఫీ కప్పు తీసుకుంటూ అడిగాడు.

"యేం లేదు. చదివారా లేదా అని మాత్రమే అడుగుతున్నాను." చేతులోని ఫ్లాస్కు టేబిల్ మీద పెట్టాని కివెళ్తూ అంది.

"ఆ!" క్రింద నుంచి పైకి ఒకే లా వుండి చివర మెలికలు తిరిగివున్న శారద జడను చూస్తూ అన్నాడు చంద్రం.

"యెలా వుంది?"

"బాగానే వుంది."

"బాగానే వుంది." కాఫీకప్పు పెదవులకు తాకించుకుంటూ అన్నాడు.

"అవును లెండి. మీరు మాత్రం మగవారు కాదు. జాతి పక్షపాతం పోనిస్తారా?" శారద కళ్ళముందు యేనాటిదో రచయిత రూపం కదిలింది. "పనీపాట లేకపోతే సరి. అయినా యీ రోజుల్లో కాని విలువ చెయ్యని చవటలు గూడా రచయితలు కాబట్టే కాలం యిలా భగ్గుమని నిప్పులేకుండానే మండిపోతుంది." అంటూ వెనక్కి తిరిగి చూడకుండానే శారద లోపలకు వెళ్ళిపోయింది. ఒకవేళ వెనక్కి తిరిగి చూసినట్లయితే కాఫీ తాగడం మర్చిపోయి నిశ్చలంగా తన వైపు చూస్తున్న భర్తని గమనించగలేది.

మళ్ళా వెంటనే తిరిగి వచ్చింది. లోపల యేదో పనిచేసి వచ్చినట్లుంది చేతులు తుడుచుకుంటూ, "స్త్రీలు తప్ప మరో విషయం దొరకలేదు మహానుభావుడికి. స్వామిరంగా! ఆ రచయిత నాకు తెలియాల్సింది. చెప్పేదాన్ని. విధవ భావాలకి పట్టిన బూజుని క్షణంలో దులిపే దానిని."

చంద్రం లేచి నిలువుటద్దం ముందు నిలబడి తల దువ్వుకోసాగాడు. అతని బిగించిన పెదవులు అదరటం మొదలు పెట్టాయి.

"అసలు మీ మగవాళ్ళకి చదువు అనవసరం అంటాను. లేకపోతే-" శారద వాక్యం పూర్తి చేయలేదు. చంద్రం మధ్యలోనే వెనక్కి తిరిగి "నోర్మూయ్. వాగకు" అన్నాడు తీవ్రంగా.

శారద నోరు ఈ హఠాత్తుగర్జనతో మాట నొక్కినట్లు మూతపడింది. నోరు తెరుచుకుని కళ్ళుమరింత పెద్దవిచేసుకుని భర్తముఖంలోకి చూస్తూ అలాగే నిలబడి పోయింది.

"ఆ వ్యాసం వ్రాసింది నేను. పదేవా. ఇహ వదులు నీ శరపరంపర" వెనక్కి తిరిగి మళ్ళా అద్దంలో చూచుకొని దువ్వుకోవటం మొదలుపెట్టాడు. శారద గొంతు పొడారిపోయింది. తన ఊహారచయిత యే మూరుమూలలో యే గొందిలోనో లేడు. అతడు విద్యాహీనుడు గూడా కాదు. అతను నిత్యం నేటి సమాజంలో తిరుగుతున్నాడు. పెద్ద చదువులు చదువుకుని సభ్య సమాజంలో సంస్కార హృదయముగల నవీన నాగరికమూర్తిగా చెలామణి అవుతున్నాడు. అతనికి స్త్రీ స్పర్శ దూరంగాదు. అతను ఊహాలోకంలో స్త్రీలను చూడటంలేదు. నోట మాటరాక అలాగే చూస్తున్న శారదతో దగ్గరగా వచ్చి ఇలా అన్నాడు.

"నిజంగా ఈనాడు చెబుతున్నాను శారదా. మొదటినుంచీ స్త్రీ అంటే అంత వుపేక్షభావం కల్గటానికి కారణం మా అత్తయ్య. అనుమానాలుగా, అసంపూర్ణంగా తొక్కిసలాడుతున్న యీ భావాలు మీ అత్తయ్య దర్శనంతో స్థిరరూపం దాల్చి గట్టి పునాదులేర్పరచుకున్నాయి. అప్పటికీ నా అభిప్రాయం తప్పేమోనని మా యింటికి వచ్చే స్త్రీలనొకరిద్దరిని పరీక్షచేశాను. వాళ్ళు మా అత్తయ్యకన్న, మీ అత్తయ్యకన్న మరో రెండు ఆకులు ఎక్కువ చదివినవారే గాని తక్కువ చదవలేదు. వీళ్ళకే గనుక చదువు, విజ్ఞానం అనేదివుంటే మనుష్యుల్ని ప్రళయకాలంలో నటరాజనృత్యం చెయించరూ? ప్రపంచంలో ఇంకెన్ని ప్రపంచయుద్ధాలు వచ్చేవో" అన్నాడు. ఇప్పుడతని కంఠం చాలా మృదుమధురంగాను, వీనుల విందుగానూ వుంది.

మాట్లాడకుండా నిలబడి క్రిందకు చూస్తున్న శారదతో—"ఏం శారదా నాది తప్పు అభిప్రాయమంటావా? వాళ్ళకే గనక చదువుంటే—" చంద్రం పూర్తిగా మాట్లాడక ముందే శారద తలెత్తి నీళ్ళు నిండిన కళ్ళతో భర్తముఖంలోకి చూస్తూ—"లేదు. వారు చదువుకుని విజ్ఞానవంతులయినట్లయితే ఆవిధముగా వారెన్నటికీ వుండేవాళ్ళు గాదు." దృఢంగా అంది.

"లేదు. నీకు తెలియదు."

"లేదు. లేదు. నాకు తెలుసు నన్ను చెప్పనివ్వండి. నిజమైనవిజ్ఞానంగనుక వుంటేవాళ్ళా మూర్ఖపు భావాల్లో వుండేవారుగాదు. సరే, మరి నా విషయంలో గూడా మీ అభిప్రాయం..." శారద కంఠంలోంచి తర్వాత మాట పెగల్లేదు.

"లేదు శారదా. నిన్ను చూచినప్పుడే నేననుకున్నాను. నేనంతకుముందు స్త్రీలలో యీభాగం చూడలేదని. ఇప్పుడిప్పుడే స్త్రీల పట నా అభిప్రాయాలు మారుతున్నాయి గూడా" అన్నాడు చంద్రం.

"అయితే పునాదుల్లో కదలిక ప్రారంభమయిందన్నమాట."

"ఆ. అవి యింకా యెంతోకాలం నిలవవుగూడాను. త్వరలో నీ సాంగత్యంతో సమూలంగా నాశనమైపోతాయి." ఇది చంద్రం అసలు స్వరూపం. అతని కంఠంలో హేళనగాని వ్యంగ్యంగాని లేవు.

"కృతజ్ఞురాలిని" అన్నది శారద వినయపూర్వకంగా తలవంచి.

"ఆమాట అనవలసింది నేను గాని నువ్వు గాదు." చంద్రం అంటుండగానే గడియారం ఆరుగంటలు కొట్టింది.

"ఇంక సినిమాకు పోదాం. త్వరగాతొళ్ళు తయారయిరా." అన్నాడు చంద్రం తృప్తి నిండిన మనసుతో శారద లోపలకు వెళ్ళిపోయింది. చంద్రం తనుగూడా డ్రస్ చేసుకోవటానికి తనగదిలోకి వెళ్ళిపోయాడు లోపలకు వెళ్ళిన శారద సినిమా మాట మర్చిపోయి జరిగిందంతా మొహర్ కి వుత్తరం వ్రాసుకోవటానికి కూర్చుండిపోయింది. ★




నారసింహ లేహ్యము

బంగారుతో చేరినది. మేహము, నిశ్శక్తి, నిస్సత్తువ వగైరా హరించి బలము రక్తవృద్ధి కల్గించును 20 తు డబ్బీ రు. 3-4-0. పోస్టేజిరు. 1-1-0

వి. ప. ఏ. అండ్ కంపెనీ ఆయుర్వేద సమాజం, పెరిదేప (PO) నెల్లూరుజిల్లా.



నమ్మకమైన నంజన్‌గూడు

బాలురకు నిత్యావశ్యకములు

కాస్తమన్ కస్తూరిమాత్రలు.

జింజిప్ జీర్ణవృద్ధికి, పిత్తశాంతికి

కర్జన్ గోరోజనమాత్రలు.

జ్వరద్ సకల జ్వరములకు.

బాలక్స్ విరేచనమాత్రలు.

కాలరెక్స్ కాలరా, అజీర్ణభేదులకు

తదితర మందులకై మాకు వ్రాయండి.

నంజన్‌గూడు వైద్యశాల

యునైటెడ్ కంపెనీ

బ్రాంచిలు. హైదరాబాదు & విజయవాడ.